క్లుప్తంగా

అమ్మవారికి కోటి కుంకుమార్చన



పూజలందుకుంటున్న అమ్మవారు

పొదిలి: స్థానిక శ్రీశ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటికుంకుమార్చన పూజలు జరుగుతున్నాయి. లోక కళ్యాణం కోసం జరిగే ఈ పూజలు మంగవారం నాటికి 25వ రోజుకు చేరుకున్నాయి. ఉభయదాతలను ఆలయంలోకి సాదరంగా ఆహ్వానించి, ప్రత్యేక పూజలు చేయిస్తున్నారు. శాలువాలతో సత్కరిస్తున్నారు. భక్తులకు లక్కీడ్రా తీసి గెలుపొందిన వారికి చీర బహుకరిస్తున్నారు. ఆలయ అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, సలహాదారులు మురళీ కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, ఎస్.నాగేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కర్, సాయి, మల్లయ్య, పానుగుపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రాచర్ల: గ్రామాల్లో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ షేక్ ఖాశింబీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలను సమీక్ష సమావేశం దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను అధికారులు దృష్టిలో పెట్టుకుని వాటిని పరిష్కారించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని వివరించారు. జెడ్పీటీసీ పగడాల దేవి, ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, డిప్యూటీ తహసీల్దార్ భారతీబాయ్, ఎంఈవో వారాణాసి గిరిధర్‌శర్మ, గృహనిర్మాణశాఖ ఏఈ విజయలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సబ్సిడీ కందుల కోసం పేర్లు నమోదు చేసుకోండి

తర్లుపాడు: మండలంలోని రైతులు ప్రభుత్వం అందిస్తున్న 30 శాతం రాయితీపై కందులు పొందేందుకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు కిలోల ఎల్ఆర్‌జీ 52 రకం రూ.392 కే అందిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు తొలి ఏకాదశి

గిద్దలూరు రూరల్: తొలిఏకాదశి సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, రాచర్ల రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, షరాబ్ బజారులోని వేంకటేశ్వర స్వామి ఆలయం, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయాలతో పాటు అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గాయతిమాత ఆలయంలో గాయత్రి యజ్ఞం నిర్వహించనున్నట్లు గాయత్రి పరివార్ సభ్యులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

మార్కాపురం టౌన్: పట్టణంలో కోతులు, కుక్కలు, దోమల సమస్యతోపాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టాలని బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు మంగళవారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌ను కోరారు. మున్సిపాలిటీ పరిధిలో వీధుల్లో కోతులు, కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను కరుస్తూ ఇబ్బంది పెడుతున్నాయన్నారు. వర్షాకాలం కావడంతో కాలువల్లో మురుగునీరు చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, డెంగీ, మలేరియా జ్వరాలు వచ్చే ప్రమాదముందని అన్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ స్థలాలు ఆక్రమించి బంకులు వేశారని, కాల్వలను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని దీనితో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని చెప్పారు. గోవులు రోడ్లపై తిరుగుతూ వాహనదారులను అవస్థలు పెడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొంతల కృష్ణ, మద్దెల లక్ష్మీదేవి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

కొనకనమిట్ల: ప్రస్తుత సమాజంలో మనిషి ప్రశాంతంగా జీవించాలంటే జ్ఞానం ఎంతో అవసరమని ప్రబోధ సేవా సమితి దొనకొండ కమిటీ అధ్యక్షుడు టి.ఏడుకొండలు అన్నారు. ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి, కె.నాగంపల్లి, రేగుమానిపల్లి గ్రామాలలో ఇంటింటికి త్రైత సిద్ధాంత, భగవద్గీత ప్రచారం చేస్తూ దైవ సందేశాలపై కరపత్రాలు, ఆధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేశారు.

మేం పక్కా..లోకల్!

ఇక్కడే పుట్టాం.. ఇక్కడే పెరిగాం.. మేం పక్కా లోకల్.. మమ్మలను కదిపే వారేలేరు అంటూ.. వరాహాలు గిద్దలూరు నగర పంచాయతీ నడిబొడ్డున భీష్మించుకు కూర్చొన్నాయి. ఎవరు ఎన్ని చెప్పినా ఇక్కడి నుంచి కదిలేది లేదని, ప్రజాప్రతినిధులు, నగర పంచాయతీ అధికారులు ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా మకాం మార్చేది లేదంటూ గిద్దలూరు పట్టణంలోని వరాహాలు తేల్చి చెప్పాయి.



గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయం



సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో వరాహాల సమూహం

గిద్దలూరు రూరల్:

గిద్దలూరు పట్టణంలో మంగళవారం సాయంత్రం వరాహాలన్నీ సగిలేరు సప్లయి చానల్‌పై సమావేశమయ్యాయి. పట్టణంలో ఉన్న వరాహాలన్నీ ఒకచోట చేరాయి. సమావేశానికి గిద్దలూరు పట్టణ వరాహాల సంఘ అధ్యక్షురాలైన పెద్ద వరాహం ముఖ్య అతిథిగా హాజరైంది. మనం నగర పంచాయతీ పరిధిలోని సగిలేరు సప్లయి చానల్ కాలువ సుమారు 2 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్నందున ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పింది. మన సంఖ్యా బలం ఎక్కువని, బంధువులు, స్నేహితులను కూడా ఇక్కడికే పిలిపించుకుని మన సత్తా చాటుదామని

- నగర పంచాయతీ అధికారులకు వరాహాల అల్టిమేటం

మిగిలిన వరాహాలకు పిలుపునిచ్చింది. మనలను ఇక్కడి నుంచి పంపించేందుకు ఎవరికీ సాధ్యపడదని తేల్చి చెప్పింది. పగలంతా ఊర్లో పడి ఇష్టమొచ్చినదంతా తిని అడ్డంగా పెరిగి రాత్రి అయ్యేసరికి సగిలేరు సప్లయి చానల్ కాలువ స్థావరానికి వచ్చి సేద తీరుదామని వారాహాలన్నీ నిర్ణయించుకున్నాయి. సమావేశంలో ఓ వరాహానికి సందేహం వచ్చి ఇలా ప్రశ్నించిందంట. కొత్త కమిషనర్ శుభ్రత..పరిశుభ్రతపై తనదైన శైలిలో విజృంభిస్తున్నారని విన్నానని, ఆయన నుంచి మనకు ముప్పు ఉంటుందని సమావేశంలో అనుమానం వ్యక్తం చేసిందట. వరాహాల నేత మాట్లాడుతూ నీ మొహం.. లోకల్ శానిటేషన్ అధికారులు, సిబ్బంది మనవాళ్లే. మనం లోకల్.. వారూ లోకల్. స్థానికులమన్న అభిమానం ఆప్యాయత వారికి అంతో ఇంతో ఉంటుందిలే. వారు మనల్ని ఏమీ చేయలేరు. లేకుంటే ఇంత పెద్ద పంట కాలువను మురికి కాలువగా మార్చి మనకు అప్పగిస్తారా చెప్పు.. అంత ఎందుకు నీకు ఇంకో మాట చెప్తా విను మన కడుపు నింపేందుకు బహిరంగ మలవిసర్జన చేస్తున్న వారిని సైతం అడ్డుకుని ఒక్కసారైనా జరిమానాలు విధించారా.. చెప్పు పట్టణంలోని నడి బొడ్డులోని కొండపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద, రాచర్లగేటు సమీపంలోని రైల్వే ట్రాక్, అంబవరం రైల్వే ట్రాక్ సమీపంలో బహిరంగ మల విసర్జన జరుగుతుంటే ఎవరు ఆపారు చెప్పు.. నిజమే.. నాయకా మీరు చెప్పింది. మీ మాటను నమ్ముతున్నాను. మనల్ని ఏమీ చేయరు. అధికారులు వస్తుంటారు.. పోతుంటారు.. మనం ఎప్పుడూ ఇక్కడే ఉంటాం.. నా మాట నమ్ము.. ధైర్యంగా వెళ్లు.. నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్లి నీ ఇష్టానుసారంగా ప్రవర్తించు.. ఎవరూ ఏమీ చేయలేరు అంటూ పలికిందట..! తోటి స్నేహితులతో విచ్చలవిడిగా సంచరిస్తూ నగర పంచాయతీ అధికారులకు సవాల్ విసురు..అని సందేహం వ్యక్తం చేసిన చిన్న వరాహానికి వరాహాల నాయకురాలు సెలవిచ్చిందట. సమావేశంలో వరాహాలన్నీ కలిసి కొన్ని తీర్మానాలు చేశాయట.

తీర్మానాలు

- వరాహాల పెంపకందారుల ఆర్థికాభివృద్ధికి పాటుపడాలి
- నగర పంచాయతీ అధికారుల ఎత్తుకు పైఎత్తులు వేయాలి
- శానిటేషన్ సిబ్బందితో స్నేహ పూర్వకంగా మెలగాలి
- శుభ్రతను ఎక్కడికక్కడ అడ్డుకోవాలి



రాజానగర్ రోడ్డులో అడ్డంగా పడుకున్న వరాహాల లీడర్

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

కొనకనమిట్ల: భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులకు కౌలు కార్డులు అందజేస్తామని స్థానిక ఏఓ ప్రసన్న రంగలక్ష్మి అన్నారు. మండలంలోని తువ్వపాడు, కాట్రగుంట గ్రామాల్లో కౌలు రైతులకు మంగళవారం సమావేశం నిర్వహించి కౌలు గుర్తింపు కార్డు వివరాలు రైతులకు వివరించారు. కౌలు రైతులు కార్డు పొందటం వలన వారికి ప్రభుత్వం నుంచి రైతులకు అందించే అన్నీ పథకాలు వర్తిస్తాయన్నారు. కౌలు రైతులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలంటే గ్రామ రెవెన్యూ అధికారులను, సంబంధిత వ్యవసాయ సహాయకులను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలన్నారు. కౌలు రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం అంటివి వర్తిస్తాయని చెప్పారు. సమావేశంలో గ్రామ వీఆర్‌ఓ రమేష్, వ్యవసాయ సహాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని ఉయ్యాలవాడ, సంజీవరాయుడుపేట, గడికోట గ్రామాలల్లో మంగళవారం నిర్వహించిన సమావేశాలల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కౌలురైతులకు కౌలు గుర్తింపు కార్డులను స్థానిక ఏఓ విజయభాస్కర్‌రెడ్డి అందజేశారు . సీసీఆర్‌సీ చట్టం ప్రకారం మండలంలోని ప్రతి కౌలురైతును గుర్తించి కౌలుగుర్తింపు కార్డులు అందజేస్తున్నామన్నారు. మండలానికి 1461 మంది రైతులను గుర్తించి కౌలుగుర్తింపు కార్డులు అందజేసే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆ దిశగా రెవెన్యూ, వ్యవసాయ శాఖకు చెందిన ప్రతి అధికారి పని చేయాలని కోరారు. గుర్తింపు కార్డుల కాలపరిమితి 11 నెలలు మాత్రమేనన్నారు. భూ యజమానులు కౌలు రైతులకు సహకరించాలన్నారు. కౌలురైతులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఎటువంటి హక్కు ఉండదన్నారు. భూయజమానులు భూమిని కౌలుకు ఇవ్వడంలో ఎటువంటి ఇబ్బంది లేదని గ్రహించాలని కోరారు. వ్యవసాయశాఖ విస్తరణాధికారిశ్రీనివాసరెడ్డి,ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారిపేట: పొలం కౌలుకు తీసుకుని సాగు చేసుకునే రైతులకు కౌలుసాగుదారు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) అండగా ఉంటుందని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. మంగళవారం మండలంలోని కోనపల్లె, గలిజేరుగుళ్ల, అక్కపల్లె ఆర్‌బీకేల్లో సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్డులు పొందిన రైతులకు వ్యవసాయశాఖ ద్వారా అందించే ఎరువులు, విత్తనాలు, పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్ పొందవచ్చన్నారు. పొలం యజమాని నుంచి అగ్రిమెంట్ తీసుకుని వీఆర్‌ఓలను సంప్రదించాలని కోరారు. కౌలు సాగుదారుకు కేవలం తను సాగు చేసే పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, యజమానికి భూమిపై హక్కు ఉంటుందన్నారు. కౌలు పత్రం పొందిన 11 నెలల తర్వాత రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఏఏలు, గలిజేరుగుళ్ల సర్పంచ్ చింతా దేవభూషణం పాల్గొన్నారు.

కంభం: అర్హులైన ప్రతి ఒక్కరూ కౌలుకార్డులకు దరఖాస్తు చేసుకోవాలని గ్రామ వ్యవసాయ సంచాలకులు రబ్బాని, వీఆర్వో వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం గ్రామంలో పర్యటించి కౌలురైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలుకు పొలం సాగు చేసుకొనే రైతులు పొలం యజమాని నుంచి అంగీకార పత్రం తీసుకొని కౌలుకార్డులు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, రాయితీలు, నష్టపరిహారం అందాలంటే తప్పనిసరిగా కౌలు కార్డులు ఉండాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులను సంప్రదించి కార్డులకు సరైన ధ్రువపత్రాలు సమర్పించి కౌలుకార్డులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న కిరణ్

మార్కాపురం రూరల్: మార్కాపురం సమీపంలోని వై జంక్షన్ వద్ద ట్రాక్టర్, బైకును ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన గార్లపాటి కిరణ్ వై జంక్షన్ మీదుగా వెళ్తుండగా ఎదురుగా మొద్దులలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో కిరణ్‌కు గాయాలయ్యాయి. అతను ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

కార్మిక వ్యతిరేక నిర్ణయాలు విడనాడండి



నినాదాలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

పొదిలి: కార్మిక వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి పి.ఓబులేసు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో మంగళవారం పీఎస్.రావు, చంద్రకళ, బి.బ్రహ్మయ్య దీక్షలో కూర్చున్నారు. వీరికి దండలు వేసిన వెంకటరావు దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపోలో మూడు సంవత్సరాల నుంచి చార్ట్‌లు వేయకుండా అధికారులు డ్రైవర్లు, కండక్టర్లను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎక్సెస్ పేరుతో కనిగిరి డిపోకు పంపించిన డ్రైవర్లను వెంటనే మాతృ డిపోకు వచ్చేలా చేసి లీవ్ పొజిషన్ కల్పించాలన్నారు. సకాలంలో ఇంక్రిమెంట్లు కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిస్పాచ్ మెకానిక్ కృష్ణ డ్రైవర్లపై పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. అహర్నిశలు సంస్థ బాగు కోసం కష్టపడుతున్న ఉద్యోగులను నిబంధనలకు విరుద్ధంగా చిన్న పాటి తప్పులకు కూడా ఆర్థిక నష్టం కలిగించే చర్యలు చేపడుతున్నారన్నారు. అక్రమ మస్టర్లు ఇచ్చి సంస్థకు ఆర్థిక నష్టం చేకూర్చుతున్న ఎస్‌టీఐపై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఏఎంటీ కార్యాలయంలో హెయిర్ బస్సులకు సంబంధించిన ఎస్ఆర్‌లు లేకపోతే ఇప్పటి వరకు అధికారులు ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. డిపోలోని లోపాల గురించి ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లినా, సంబంధిత సూపర్‌వైజర్లపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఈ నిరాహార దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎండీఏ బాజీ, గౌరవాధ్యక్షుడు ఎం.షరీఫ్, కోశాధికారి ఎస్ కే.జిలానీ, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్‌కేకే బాష, జాయింట్ సెక్రటరీ ఏ.దివాకర్, మహిళా కమిటీ సభ్యులు ఎంపీసీ కళ, సభ్యులు పాల్గొన్నారు.

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు

మార్కాపురం: ఇటీవల బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు పుప్పాల శ్రీనివాసరావు, పిల్లి సుధాకర్, వై పూర్ణ మహేష్‌లపై దాడి చేయడం అమానుష చర్య అని మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపని కాశయ్య, యద్దనపూడి అనిల్‌కుమార్ అన్నారు. న్యాయవాదులపై దాడికి నిరసనగా మంగళవారం పట్టణ బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్న న్యాయవాదులపై, న్యాయవ్యవస్థపై దాడి చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దాడులు చేసి న్యాయవ్యవస్థ అదుపు చేయాలనుకోవడం మూర్ఖత్వానికి నిదర్శనమని అన్నారు. న్యాయవాదులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి చర్యలు తిరిగి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాసచౌదరి, ఉపాధ్యక్షుడు ఉమ్మడి రవీంద్ర, ఎస్‌కె యూసఫ్అలీ, సీనియర్ న్యాయవాదులు గాయం లక్ష్మీకుమార్‌రెడ్డి, సయ్యద్ అలీ జహీర్, శివరాత్రి ప్రసాద్, ఇమ్మడిశెట్టి నాగేశ్వరరావు, కడియం రామయ్య, వల్లభనేని కాశయ్య, తోట ఉషశ్రీ, వై వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, బత్తుల రామిరెడ్డి, హరిక్రిష్ణ, గాంధిరెడ్డితోపాటు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కోసం వినతి

గిద్దలూరు రూరల్: స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావును బీజేపీ నాయకుడు అప్పిశెట్టి శేఖర్ మంగళవారం కలిసి ప్రెస్‌క్లబ్ కోసం అనువైన స్థలం కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలోని వేగాస్ రెస్టారెంట్ పక్కన ఉన్న 37 సెంట్ల ప్రభుత్వ భూమిని ప్రెస్ క్లబ్‌కు కేటాయించాలని ఆయన కోరారు. సదరు ప్రభుత్వ స్థలంలో చిల్లచెట్లు పెరిగి మురికి కాలువ నీరు పారుతోందని, ఆ స్థలాన్ని ప్రెస్‌క్లబ్‌కు ఇస్తే అందరికీ బాగుంటుందని చెప్పారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

సత్తాచాటిన బేస్తవారిపేట ఎడ్లు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమారుడు విఘ్నేష్‌రెడ్డి

తర్లుపాడు: హజరత్ ఖాశీంస్వామి వారి పీర్లపండుగ సందర్భంగా మండలంలోని తుమ్మలచెరువులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెండు పండ్ల విభాగంలో బేస్తవారిపేటకు చెందిన వేగినాటి ఓసురారెడ్డి ఎడ్లు 3500 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.25 వేలు దక్కించుకుని సత్తా చాటాయి. తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన వడ్డేమాను ఆంజనేయరెడ్డికి చెందిన ఎడ్లు 3250 అడుగులు లాగి రెండో బహుమతి రూ.20 వేలు గెలుచుకున్నాయి. కొమరోలుకు చెందిన కామూరి రమణారెడ్డి, బత్తుల భూపాల్‌కు చెందిన ఎడ్లు 3వ బహుమతి, దువ్వూరుకు చెందిన జిల్లెల ఆంజనేయులు, గుడిపాడుకు చెందిన చిన్న కొండారెడ్డిలకు చెందిన ఎడ్లు 4వ బహుమతి, అద్దంకికి చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, చిలుకూరి నాగేశ్వరరావుకు చెందిన ఎడ్లు 5వ బహుమతి, సూరేపల్లికి చెందిన బీరం వెంకటరెడ్డి 6వ బహుమతి, వంగపాడుకు చెందిన కత్తిరాజు, అచ్చంపేటకు చెందిన మామిళ్ల శ్రీనివాసరెడ్డి, కుక్కలవారిపాలెంకు చెందిన శివజ్ఞానేశ్వర్ రెడ్డి, మోక్షిత్‌రెడ్డిలకు చెందిన ఎడ్లు బహుమతులు గెలుచుకున్నాయి. పోటీలను మాజీ జెడ్పీటీసీ సభ్యులు రావిభాషాపతిరెడ్డి, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి ప్రారంభించారు. విజేతలకు గ్రామకమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. యాంకర్‌గా ఎస్ వెంకటరామిరెడ్డి వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పీర్లచావిడిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

గిద్దలూరు రూరల్: మొహర్రం పండగ సందర్భంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద, గాంధీబొమ్మ సెంటర్‌లోని పీర్లచావిడల వద్ద ముస్లింలు మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని ముండ్లపాడు, కొమ్మునూరు, కంచిపల్లె, ఉయ్యాలవాడ, సూరేపల్లె గ్రామాల్లో ముస్లింలు మొహర్రం పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సరిగేసు సందర్భంగా గుండంలో కట్టెలు వేసి అగ్ని వెలిగించారు. మతసామరస్యానికి చిహ్నంగా హిందు ముస్లిం సోదరులు కలిసి మెలసి పీర్లచావిడిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీర్ల చావిడల వద్ద పండగ వాతావరణ సంతరించుకుంది.

కంభం: మండలంలో మొహర్రం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జంగంగుంట్ల, లింగోజీపల్లి, యల్‌కోట, రావిపాడు, హజరత్‌గూడెం గ్రామాల్లోని పీర్లచావిడిలో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లు కొలువుదీరాయి. మంగళవారం రాత్రి పెద్దసరిగేసు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద షరిగత్



పీర్ల వద్ద మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

తర్లుపాడు: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం తుమ్మలచెరువులో పెద్ద షరిగత్ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంతానంలేని వారు నైవేద్యం సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. నేటి అర్ధరాత్రి నుంచి పీర్లను గ్రామోత్సవం నిర్వహిస్తారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సీఐ మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. మార్కాపురం నుంచి తుమ్మలచెరువుకు ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సులు ఏర్పాటు చేశారు. నేటి సాయంత్రం పీర్లు నీట మునగడంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయి. పెద్ద సరిగెత్తు సందర్భంగా తుమ్మల చెరువులో హజ్రత్ ఖాసింస్వామి వారిని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, స్థానిక సర్పంచ్ షాజహాన్ రసూల్, ఎంపీపీ భూ లక్ష్మీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాస్ రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ రామిరెడ్డి, కేతగుడిపి సర్పంచ్ పెద్ద మస్తాన్, పోతలపాడు సర్పంచ్ శ్రీని వాస్ రెడ్డి పార్టీ నాయకులు రామ కృష్ణ రెడ్డి, శేషయ్య, గాయం శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అబ్దుల్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.